సాక్షి అనకాపల్లి

మంగళవారం । 9 । మే । 2023



సీ.. వాహరియర్!
విశాఖలో యుద్ధ విమాన మ్యూజియం పనులు పూర్తయ్యాయి. సీఎం జగన్ ఈనెల 11న ప్రారంభించనున్నారు. 8లో



అర్జీదారును తృప్తి పరిచేలా..
కలెక్టరేట్ స్పందనలో కలెక్టర్, జేసీ వినతులను స్వీకరించారు. మొత్తం 271 అర్జీలు వచ్చాయి. 8లో



డిక్కీలో రేకు అమర్చి..
పోలీసుల కళ్లు గప్పి తరలిస్తున్న గంజాయిని మాకవరపాలెం, దేవరాపల్లి మండలాల్లో పెద్దఎత్తున స్వాధీనం చేసుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ

తుమ్మపాల: రెడ్‌క్రాస్ డే సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్మూర్తి, డీఆర్వో పి.వెంకటరమణ సోమ వారం ప్రారంభించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు చల్లని మజ్జిగను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ హిమజ, స్టేట్ కమిటీ సభ్యుడు విరణ్, వెంకటరమణ, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'బంగారుతల్లికి ఘన స్వాగతం



క్రీడాకారిణి జ్యోత్స్నను ఊరేగిస్తున్న వ్యాయామసంఘం సభ్యులు

అనకాపల్లి టౌన్: కేరళ రాష్ట్రం అల్పుజాలో జరిగిన సబ్ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించి పట్టణానికి చేరుకున్న ఎ.జ్యోత్స్నకు సోమవారం ఘన స్వాగతం లభించింది. సీతారామ వ్యాయామ సంఘం సభ్యులు ఆమెను ఊరేగించారు. ఆమె ఏషియన్ చాంపియన్‌షిప్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి స్క్వాట్, బెంచ్ ప్రెస్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. తమ సంఘ సభ్యురాలైన జ్యోత్స్న ఈ ఘనత సాధించడం తమకు గర్వకారణమని సీతారామ వ్యాయామ సంఘం నిర్వాహకులు ఈ సందర్భంగా చెప్పారు.

కేజీహెచ్‌కు ఏడు మానికిన్స్ మంజూరు



ఎనస్థీషియా విభాగానికి అందించిన మానికిన్స్

మహారాణిపేట: సీపీఆర్ శిక్షణకు అవసరమైన ఏడు మానికిన్స్‌ను ప్రభుత్వం కేజీహెచ్‌కు మంజూరు చేసింది. సోమవారం వీటిని ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ ఎ.పద్మజకు సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ జగదీష్‌కుమార్, ఏఆర్ఎంవో డాక్టర్ అరుణాదేవి, ప్రొఫెసర్ డాక్టర్ రవి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ పురస్కార ప్రదానం



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న కలెక్టర్ డా.మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: రక్తదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించినందుకు గాను విశాఖ జిల్లాకు లభించిన రెడ్‌క్రాస్ పురస్కారాన్ని కలెక్టర్ డా.మల్లికార్జున సోమవారం అందుకున్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రక్తదానం, పర్యావరణ విషయంలో అద్భుత సేవలందించిన జిల్లాలను గవర్నర్ ప్రశంసించారు. జిల్లాకు వచ్చిన అవార్డు, బంగారు పతకాన్ని కలెక్టర్ స్వీకరించారు. భవిష్యత్తులో సేవల్ని మరింత విస్తరింపజేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

12న ఉపాధి స్పెషల్ డ్రైవ్

మహారాణిపేట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ, ఉపాధి కోసం ఈ నెల 12న విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(నరవ)లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. హెచ్‌సీఎల్‌లో ఉద్యోగావకాశం కల్పించనున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ కె.ఎస్.విశ్వనాథన్ పోస్టర్ ఆవిష్కరించారు. వివరాల కోసం 9959377669, 9848438254 నంబర్లలో సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చైతన్య తెలిపారు.



పంచరంగుల ముగ్గు



నదిలో దేవతమ్మ నిమజ్జనం



దోనెలపై దేవతమ్మ బుట్టను తరలిస్తున్న నిర్వాహకులు

వైభవంగా దేవతమ్మ ఉత్సవం

కశింకోటలోని గవరపేటలో సోమవారం దేవతమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవం పురస్కరించుకుని దేవతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఎక్కువ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అరటి గెలలు, చీర, రవికెలు, తలనీలాల రూపంలో మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో భాగంగా వేగి కుటుంబీకుల పిల్లలతో సంప్రదాయంగా వేసిన సిద్దుల వేషం అలరించింది. పంచరంగుల ముగ్గు వేస్తున్నంతసేపూ మహిళలు ఆసక్తిగా తిలకించారు. ముగ్గు వేసిన తర్వాత సంప్రదాయంగా స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేగి ఇంటి పేరున్నవారు ఉత్సాహంగా ముగ్గును తొక్కి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మ వారి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డప్పుల మేళాలు, యువత నృత్యాలతో ఊరేగింపుగా తరలి, దోనెలపై నది అవలకు చేరుకుని అమ్మవారిని నిమజ్జనం చేశారు. ఉత్సవంలో భాగంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి సత్యారావు, వేగి కాశీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దలు వేగి ఆదినారాయణ, వేగి సత్యనారాయణ, వేగి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. –కశింకోట

11న సీఎం జగన్ రాక

వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం



బీచ్‌రోడ్డు (విశాఖ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 11న విశాఖ నగరానికి రానున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 2.30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 3.20కు విశాఖ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడ హెలికాప్టర్‌లో 3.50 గంటలకు పీఎం పాలెం వైఎస్సార్ స్టేడియానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. స్థానిక నాయకులను కలిసి, కాసేపు మాట్లాడనున్నారు. సాయంత్రం 4.50 గంటలకు తిరిగి రోడ్డు మార్గంలో ఆరిలోవ అపోలో ఆస్పత్రికి చేరుకుని, అపోలో కేన్సర్ ఆస్పత్రిని ప్రారంభిస్తారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించాక, 5.35 గంటలకు బయలుదేరి బీచ్‌రోడ్డు చేరుకుంటారు. అక్కడ వీఎంఆర్డీఏ అభివృద్ధి చేసిన సీ హారియర్ యుద్ధవిమాన మ్యూజియంను ప్రారంభిస్తారు. దీంతోపాటు అక్కడి నుంచే రామ్‌నగర్‌లోని వీఎంఆర్డీఏ కాంప్లెక్స్, ఎంవీపీలోని ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ప్రారంభించనున్నారు. అనంతరం ఎండాడలోని కాపు భవనం, భీమిలిలోని ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి 6.15 గంటలకు బయలుదేరి బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్లో జరుగుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కుమారుడు వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొంటారు. అనంతరం రాత్రి 7 గంటలకు తిరుగు ప్రయాణమై, విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయల్దేరతారు. రాత్రి 8:20కి తాడేపల్లిలోని తన నివాసానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి చేరుకోనున్నారు.

విద్యార్థులు సురక్షితం...
తల్లిదండ్రుల ఆనందం

మణిపూర్ నుంచి హైదరాబాద్, కోల్‌కతా చేరుకున్న జిల్లా విద్యార్థులు



సహచర విద్యార్థులతో కలిసి హైదరాబాద్ నుంచి బస్సులో బయలుదేరిన యశ్వంత్ (కుడి)

రావికమతం/దేవరాపల్లి: తమ పిల్లలు మణిపూర్ మంటల నుంచి ఎలా బయటపడతారోనని కొద్ది రోజులుగా ఆందోళనతో గడిపిన తల్లిదండ్రులు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానాల్లో తెలుగు విద్యార్థులు హైదరాబాద్, కోల్‌కతా చేరుకొని, అక్కడి నుంచి స్వస్థలాలకు బయలుదేరడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. మండలంలోని దొండపూడి గ్రామానికి చెందిన కొప్పాక యశ్వంత్ మణిపూర్ ఐఐటీలో థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. అక్కడి అల్లర్ల వల్ల కళాశాలలో బిక్కు బిక్కుమంటూ గడిపాడు. గ్రామంలోని తల్లిదండ్రులు కొప్పాక అప్పారావు, ఆదిలక్ష్మి తమ కుమారుడికి ఫోన్ చేయగా పరిస్థితులు భయాందోళనగానే ఉన్నాయని యశ్వంత్ వివరించడంతో వారు తీవ్ర ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అక్కడ ఉన్న విద్యార్థులందరినీ ప్రత్యేక విమానాల్లో సురక్షితంగా రాష్ట్రానికి తరలిస్తూ చర్యలు చేపట్టడం, హెల్ప్‌లైన్ నంబర్ ప్రసార మాధ్యమాల్లో ప్రసారం చేయడంతో యశ్వంత్ ఆ నంబర్‌కు కాల్ చేయగా అధికారులు ఆగమేఘాలపై స్పందించారు. యశ్వంత్‌కు ఫోన్ చేసి ఏం చేయాలి, ఎవరిని కలవాలి అనే వివరాలు చెప్పడమే కాక ప్రత్యేక అధికారులు ఆ విద్యార్థిని కలిసి స్వయంగా హైదరాబాద్ విమానం ఎక్కించారు. ఆందోళన పడవద్దని ధైర్యం చెప్పి అన్ని సౌకర్యాలు కల్పించినట్టు యశ్వంత్ ఫోన్‌లో స్వయంగా తెలియజేశారు. సోమవారం హైదరాబాద్ విమానాశ్రయంలో యశ్వంత్ దిగడం సాక్షి టీవీలో కనబడడంతో జస్వంత్ తల్లిదండ్రులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు. ఎంతో చొరవ చూపిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



ఇంఫాల్ విమానాశ్రయంలో వేపాడ వెంకటేష్, తదితర విద్యార్థుల ఆనందం

కోల్‌కతా చేరుకున్న వేపాడ వెంకటేష్

మణిపూర్‌లో చిక్కుకున్న దేవరాపల్లి మండలం వాకపల్లికి చెందిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థి వేపాడ వెంకటేష్ ప్రత్యేక విమానంలో కోల్‌కతా విమానాశ్రయానికి సోమవారం సురక్షితంగా చేరుకున్నాడు. హైదరాబాద్‌కు ప్రత్యేక విమానంలో తరలిస్తున్నారని, అక్కడి నుండి ప్రత్యేక బస్సుల్లో స్వగ్రామాలకు చేర్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. మంగళవారం రాత్రికి స్వగ్రామం వాకపల్లి చేరుకునే అవకాశం ఉందని వెంకటేష్ తెలిపాడు. తమకు సమీపంలో జరిగిన హింసాత్మక ఘటనలు చూసి క్షేమంగా బయటపడతామన్న ఆశ లేకపోయిందని చెప్పాడు. ప్రత్యేక చొరవ చూపి ప్రత్యేక విమానాల్లో తరలించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశాడు. తమ కుమారుడు కోల్‌కతాకు క్షేమంగా చేరుకోడం పట్ల వెంకటేష్ తల్లిదండ్రులు వేపాడ రాజబాబు, కొండమ్మ ఆనందం వ్యక్తం చేశారు.

రేపు పాలిసెట్

తుమ్మపాల: ఈ నెల 10వ తేదీన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్–2023) నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు జరిగే పరీక్షకు ఉదయం 9.30 గంటల నుంచి విద్యార్థులను అనుమతిస్తామన్నారు. జిల్లాలో అనకాపల్లి డివిజన్‌లో 16, నర్సీపట్నం డివిజన్‌లో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9324 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, బాల్‌పాయింట్ పెన్ (బ్లూ, బ్లాక్) తమ వెంట తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్ వంటి ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. ఉదయం 11 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరన్నారు.

త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు

- జిల్లా ప్రత్యేకాధికారి నివాస్ ఆదేశం
- వర్షాలకు తడిచిన వరి పంట పరిశీలన



వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి నివాస్, కలెక్టర్

రాంబిల్లి: రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తి స్థాయిలో సేకరించాలని అనకాపల్లి జిల్లా ప్రత్యేకాధికారి, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. ఆయన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి రాంబిల్లి మండలంలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. దిమిలిలో సోమవారం ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. 500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఏవో సి.సుమంత ఉన్నతాధికారులకు వివరించారు. మర్రిపాలెం సమీపంలో వర్షాలకు తడిచి దెబ్బతిన్న వరిపంటను నివాస్ పరిశీలించారు. న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

దిమిలి పీహెచ్‌సీ తనిఖీ

జిల్లా ప్రత్యేకాధికారి నివాస్ కలెక్టర్‌తో కలిసి దిమిలి పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులు, మందులు పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఇకపై రాత్రి పూట ఒక స్టాఫ్‌నర్సును అందుబాటులో వుంచి వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌ను ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, తహసీల్దార్ పి.భాగ్యవతి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతోనే ప్రజా మన్నన

- ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు
- వేచలం ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

దేవరాపల్లి: ప్రజలకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహించకుండా, మెరుగైన వైద్య సేవలందించి ప్రజా మన్ననలు పొందాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. వేచలం ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నాడు–నేడు స్కీమ్‌లో చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి గదితోపాటు మందులు నిల్వ చేసే ఫార్మసిస్టు, ఎంపీహెచ్‌ఈవో గదులను సైతం పరిశీలించి దుమ్ము ధూళి ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యాన్ని పంచే ఆస్పత్రి పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బి.హారికకు సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరించాలన్నారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు తదితర్లు ఉన్నారు.



వేచలం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

సైబర్ కేటుగాళ్లు..!



నాతవరం మండలం ములగపూడి గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ ఇ.రాజేశ్వరికి ఇటీవల ఓ ఫోన్ కాల్ వచ్చింది. అమరావతి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని, మీ పరిధిలో అమ్మ ఒడి లబ్ధి అందని వారి వివరాలు, ఫోన్ నంబర్ చెప్పమని అడిగారు. సాంకేతిక కారణాల వల్ల ఆ పథకం సొమ్ము అందని విద్యార్థి తల్లిదండ్రులు గ్రంథి భాగ్యలక్ష్మి, రవికుమార్ వివరాలు ఆమె చెప్పారు. వారిని, వలంటీర్‌ను టెలీ కాన్ఫరెన్స్‌లో కలిపి, రెండు నిమిషాల తర్వాత వలంటీర్ కాల్ కట్ చేసి భాగ్యలక్ష్మి, రవికుమార్లతో సంభాషణ కొనసాగించారు. ముందు భాగ్యలక్ష్మి బ్యాంక్ ఖాతా వివరాలు అడిగారు. ఎందుకైనా మంచిది.. మీ భర్త రవికుమార్ బ్యాంక్ ఖాతా వివరాలు సైతం ఇవ్వాలని అడిగారు. కొద్దిసేపటి తరవాత వారిద్దరి ఫోన్లకు రెండు లింక్‌లు వచ్చాయి. మోసగాళ్లు పంపిన ఈ లింక్‌లు క్లిక్ చేయగానే భాగ్యలక్ష్మి ఖాతా నుంచి రూ.9 వేలు, రవికుమార్ ఖాతా నుంచి రూ.4 వేలు మొత్తం రూ.13 వేలు కట్ అయ్యాయి.

అచ్యుతాపురం మండలం కొండకర్ల ఉన్నత పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ టీచర్ అవధూతల రాము కుమారుడికి అమ్మ ఒడి పెండింగ్‌లో ఉంది. వలంటీర్‌కి కాల్ చేసి రాముతో మాట్లాడి.. పథకం కింద నగదును అందిస్తామని బ్యాంకు, ఏటీఎం కార్డు వివరాలను పంపించాలని కోరారు. బ్యాంకు వివరాలను పంపించడంతో పాటు మొబైల్ ఫోన్‌కు వచ్చే లింక్‌లను ఓకే చేయాలని సూచించారు. అలా చేయగానే బ్యాంకు ఖాతాల నుంచి రూ.2 వేలు చొప్పున రెండుసార్లు మొత్తం రూ.4 వేలు మాయమయ్యాయి.

హరిపాలేనికి చెందిన గణేష్‌కు కూడా ఇదేవిధంగా ఫోన్ కాల్ వచ్చినా ఆయన అనుమానంతో సచివాలయ ఉద్యోగులను సంప్రదించారు. ఇది ఫేక్ అని చెప్పడంతో మోసపోకుండా బయటపడ్డారు. నవరత్నాల పథకాల ద్వారా లబ్ధి పొందని వారి వివరాలను సేకరించి సైబర్ నేరగాళ్లు ఇలా మోసం చేస్తున్నారు.

- నవరత్నాల స్కీంలో పెండింగ్‌లో ఉన్న వారే టార్గెట్
- గ్రామీణ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు
- నాలుగు నెలల వ్యవధిలో 11 కేసులు నమోదు
- పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు

సాక్షి, అనకాపల్లి: సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రజలను టార్గెట్ చేస్తున్నారు. ముఖ్యంగా నవరత్నాల పథకాల లబ్ధిదారులపై దృష్టి పెట్టారు. వివిధ కారణాల వల్ల ఇంకా లబ్ధి అందుకోని వారి వివరాలు సేకరించి, వారికి ఫోన్లు చేసి, బ్యాంకు అకౌంట్ నంబర్ అడుగుతున్నారు. వారి ఫోన్‌కు లింక్ పంపిస్తున్నారు. పథకం ఇంకా అందలేదన్న ఆతృతలో లబ్ధిదారులు వెనుక ముందు ఆలోచించకుండా లింక్‌పై క్లిక్ చేయగానే వారి అకౌంట్ నుంచి సొమ్ము మాయమవుతోంది. సైబర్ కేటుగాళ్లు ఈ కొత్త రూటును ఎంచుకోవడంతో లబ్ధిదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. ఇటీవల నాతవరం, అచ్యుతాపురం, పరవాడ, నర్సీపట్నం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇలాంటి కేసులు వెలుగుచూశాయి. నాలుగు నెలల వ్యవధిలో సంక్షేమ పథకాలు, క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్, బ్యాంక్ ఫ్రాడ్‌లకు పాల్పడిన కేసులు 11 వరకు నమోదయ్యాయి. సైబర్ క్రైమ్ వలన ఎందరో అమాయక ప్రజలు, యువత మోసపోతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏటీఎం పిన్, ఆధార్ నంబర్లు అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి తరహా ఆర్థిక మోసాలకు గురైతే తక్షణమే 1930 నంబరుకు కాల్ చేయాలని జిల్లా పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

'లోకల్' సైబర్ నేరగాళ్ల పనా..!

ప్రభుత్వ స్కీంల పేరిట ఇటీవల జరిగిన సైబర్ నేరాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఎస్పీ మురళీకృష్ణ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. గ్రామీణ ప్రాంత వలంటీర్ల నంబర్లు సైబర్ నేరగాళ్లకు ఎలా వచ్చాయి.. సంబంధిత వలంటీర్ పరిధిలో ప్రభుత్వ స్కీంలు పెండింగ్‌లో ఉన్నవారి డేటా వారు ఎలా తస్కరించారు.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇటువంటి తరహా మోసాలు జిల్లాలో ఇంకెక్కడైనా జరిగాయా? మోసపోయినా పోలీసులకు చెప్పని వారెవరైనా ఉన్నారా...? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. ఇందులో లోకల్ నేరగాళ్ల ప్రమేయం ఉందా.. అనే కోణంలో విచారిస్తున్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా కూడా ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలు పోలీసులు చేపడుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో పోలీసు ప్రచార వాహనాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

పోలీసుల సూచనలు...

- మీ బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు లావాదేవీలన్నింటితో ఇ–మెయిల్, మొబైల్ అలెర్ట్ అనుసంధానం చేసుకోవాలి
- అపరిచిత వ్యక్తులతో బ్యాంక్, ఆధార్ ఇతర వివరాలు పంచుకోవద్దు. బ్యాంకులు, బీమా కంపెనీలు ఇ–మెయిల్ ద్వారా వ్యక్తిగత సమాచారం అడగవు.
- పొరపాటున మీ ఫోన్ పే, గూగుల్ పే ఖాతాలో డబ్బులు వేశామని, వాటిని వెనక్కి పంపండి.. అని ఎవరైనా కాల్ చేసినట్లయితే వారికి తిరిగి డబ్బులు పంపవద్దు
- గూగుల్ సెర్చ్‌లో కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతుకుతున్నప్పుడు నకిలీ వెబ్‌సైట్లు ఉంటాయి జాగ్రత్త
- ఆన్‌లైన్ గేమింగ్, క్రికెట్ బెట్టింగ్‌ల పేరిట అత్యాశకు పోయి.. అప్పుల్లో మునిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువతను గమనించి తల్లిదండ్రులు దారిలో పెట్టాలి
- ఆన్‌లైన్ డేటింగ్ యాప్స్ పేరిట బ్లాక్‌మెయిల్ చేసి నేరాలకు పాల్పడతారు. సోషల్ మీడియాలో ట్రాప్ చేయడానికి గిఫ్టులు కూడా పంపించే అవకాశాలున్నాయి. డేటింగ్ సైట్లు, డేటింగ్ యాప్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి



మోసపోతే తక్షణమే ఫిర్యాదు చేయండి



వలంటీర్ల డేటాను కూడా సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తున్నారు. వలంటీర్ల నంబర్ల ద్వారా గ్రామాల్లో నవరత్నాల పథకాల పేరిట సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. అలాంటి కాల్స్ వస్తే అప్రమత్తంగా ఉండండి. వారికి బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వవద్దు. ఒకవేళ ఏదైనా సైబర్ మోసానికి గురైనట్టు అనుమానం కలిగితే 1930కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చు. బ్యాంకు లావాదేవీల్లో మోసపోతే వెంటనే హోం బ్రాంచ్‌ను సంప్రదించాలి. మోసపోయిన వెంటనే బాధితులు సమీప పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయాలి.

– కె.వి.మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం


లక్ష్మి (ఫైల్)

చీడికాడ: మండలంలో అర్జునగిరి గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పి. రామారావు సోమవారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం ... పెంటకోట గంగునాయుడు భార్య లక్ష్మి (38) ఈ నెల 4వ తేదీన ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి కళ్లానికి వెళ్తున్నానని చెప్పి కనిపించకుండా పోయింది. బంధువులు, స్నేహితులు చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో శనివారం భర్త గంగునాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ తెలిస్తే 9440904210 సమాచారం అందజేయాలని ఎస్ఐ తెలిపారు.

విద్యాకానుక పంపిణీకి పటిష్ట చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆదారి రవిబాబు

అనకాపల్లిటౌన్: జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి జిల్లాలోని సీఆర్పీలు, ఎంఆర్సీలు ప్రత్యేక దృష్టి సారించాలని విద్యాశాఖ జిల్లా స్కీమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆదారి రవిబాబు సూచించారు. స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి విద్యా సంవత్సరానికి ముందే ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక సామగ్రిని ప్రభుత్వం పంపించిందన్నారు. ఈ సామగ్రిని విశాలమైన గదుల్లో, భారీ వాహనాలతో తరలించేందుకు వీలుగా ఉండే పాఠశాలల్లో నిల్వ చేయాలని సిబ్బందికి తెలిపారు. సామగ్రి నాణ్యతను పరిశీలించాకే, గదుల్లో నిల్వ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ, సీఆర్పీలు, ఎంఆర్సీలు పాల్గొన్నారు.

అర్జీదారును సంతృప్తి పరిచేలా పరిష్కారం

- స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- 271 అర్జీల స్వీకరణ


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: స్పందన కార్యక్రమంలో ప్రజలు పెట్టే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ హాలులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయనతోపాటు జేసీ ఎం.జాహ్నవి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత శాఖల జిల్లా అధికారులను పిలిచి సమస్య పరిష్కారంపై చర్యలకు ఆదేశించారు. స్పందనలో వచ్చే ప్రతి ఫిర్యాదు, వినతులపై స్పష్టమైన సమాధానంతో వివరణ ఇచ్చి అర్జీదారుడ్ని సంతృప్తి పరచాలన్నారు. ఒకే అంశంపై ఫిర్యాదులు పునరావృతం అయ్యేందుకు అవకాశం ఉండకూడదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి అర్జీదారుడి నుంచి వివరణ తీసుకోవాలన్నారు. స్పందన అర్జీల నమోదు శిబిరం వద్ద వృద్ధులు, దివ్యాంగుల అర్జీలను డీఆర్వో వెంకటరమణ పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. ఈ వారం మొత్తం 271 అర్జీలు నమోదయ్యాయి. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికి జిల్లా నలుమూలల నుంచి ప్రజల మాత్రం అధికంగానే తరలివచ్చారు. పలువురు తమ సమస్యలపై కలెక్టరేట్ గేటు వద్ద నిరసనలు, ధర్నాలు చేపట్టారు. స్పందన అర్జీల నమోదు కేంద్రం వద్ద రద్దీ కారణంగా వృద్ధులు, మహిళలు కలెక్టరేట్ సముదాయంలో చెట్ల కిందే ఉండిపోయారు.

పింఛన్ ఇవ్వండయ్యా....

ప్రభుత్వం ఇచ్చే పింఛన్ నిలిచిపోయిందని, పునరుద్ధరించి ఆదుకోవాలని బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడికి చెందిన వృద్ధురాళ్లు కలెక్టరేట్‌లో మొరపెట్టుకున్నారు. గ్రామానికి చెందిన గొంపా దేముడమ్మ (85), పినపోలు చిలుకమ్మ (78)లకు వృద్ధాప్య పింఛన్లు నిలిచిపోయాయి. వీరిద్దరి కుమార్తెలకు వితంతు పింఛన్ ప్రభుత్వం ప్రతినెలా ఇస్తోంది. నిబంధనల ప్రకారం ఒకే రేషన్ కార్డులో ఒకరికే పింఛన్ ఇవ్వడం వల్ల వృద్ధులైన వీరికి నిలిపివేశారు. నిబంధనలు సడలించి వృద్ధులైన మాకు న్యాయం చేయాలని కోరారు.

క్వారీ యాజమానుల బెదిరింపుల నుంచి రక్షణ కల్పించాలి....

మాకవరపాలెం మండలం జి.కోడూరు సర్వే నంబరు 332లో 24 హెక్టార్ల క్వారీ యాజమానులు మమ్మల్ని బెదిరిస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని జి.కోడూరు, వెంకటాపురం, సుబ్రహ్మణ్యాపాలెం, ఎరకన్నపాలెం గ్రామస్తులు కలెక్టరేట్ గేటు వద్ద నిరసన చేపట్టారు. స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నల్లరాయి క్వారీ కారణంగా రైతుల సాగు భూములు, జీడిమామిడి పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. దీంతో కోర్టులో వేసిన వ్యాజ్యంతో క్వారీ నిలిపివేశారు. ఇటీవల క్వారీ యజమానులు పనులు చేసేందుకు సిద్ధమవుతూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

అనకాపల్లి మండలం మారేడుపూడి సర్వే నంబరు 357 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను పూర్తిస్థాయిలో తొలగించాలంటూ గ్రామానికి చెందిన ఎం.పైడిరాజు స్పందనలో ఫిర్యాదు చేశాడు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఆక్రమణగా గుర్తించిన నిర్మాణాల్లో కొన్నింటిని మాత్రమే తొలగించి, మిగిలిన వారికి అండగా నిలుస్తున్నారని వాపోయారు. మిగిలిన నిర్మాణాలను వెంటనే తొలగించి అందరికి ఒకే విధమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 36 అర్జీలు

అనకాపల్లి టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 36 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, అర్జీలను స్వీకరిస్తూ, చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్పందనలో వచ్చే అర్జీలకు నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని దిగువ స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కువగా ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, ఇతర సమస్యలపై అర్జీలు వచ్చాయని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

డిక్కీలో రేకు అమర్చి గంజాయి తరలింపు

- హైదరాబాద్‌కు తరలిస్తున్న కారులో 140 కేజీల స్వాధీనం
- ఇద్దరు ఒడిశా నిందితులతోపాటు మహిళ అరెస్టు


కారు డిక్కీలో అమర్చిన రేకులో నుంచి తీస్తున్న గంజాయి


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మాకవరపాలెం: పోలీసుల నిఘా పెరగడంతో గంజాయి ముఠా సరికొత్త ఎత్తుగడలు వేస్తోంది. పుష్ప సినిమా తరహాలో ఖాకీల కళ్లుగప్పి తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా కారు డిక్కీలో ప్రత్యేకంగా అమర్చిన ఇనుప రేకు కింద 140 కిలోల గంజాయి పెట్టి తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడింది. ఒడిశాకు చెందిన ఇద్దరు నిందితులతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన మహిళను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య సోమవారం మాకవరపాలెంలో వెల్లడించిన వివరాల ప్రకారం... ఎస్ఐ రామకృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మండలంలోని చంద్రయ్యపాలెం వద్ద ఆదివారం రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో నర్సీపట్నం నుంచి మాకవరపాలెం వైపు వస్తున్న కారును తనిఖీ చేయగా డిక్కీ లోపల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. డిక్కీలో రేకును తొలగించి అందులో 140 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని ఒడిశా రాష్ట్రం చిత్రకొండ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు గుర్తించారు. చిత్రకొండకు చెందిన శంకర్‌కారా(28), ప్రభాభత్ర(28)తోపాటు, అల్లూరి సీతారామరాజు జిల్లా వై. రామవరం మండలం మునగపాడుకు చెందిన చిక్కుడు రాధ(27) అనే మహిళను అరెస్టు చేశారు. కారుతోపాటు నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

దేవరాపల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒక బాలుడితో పాటు ఇద్దరు యువకులను సోమవారం అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. మండలంలోని శ్రీరాంపురం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురిని అనుమానంతో అదుపులోకి తీసుకుని సోదాలు నిర్వహించగా వారి వద్ద 8 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయితో పట్టుబడిన వారిలో విశాఖ ఎంవీపీ కాలనీకి చెందిన జి.విజయశివ భార్గవరెడ్డి, గుజ్జు రాముతో పాటు ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పాడువ మండలం దార్లపూడి గ్రామానికి చెందిన పదహారేళ్ల బాలుడు ఉన్నారన్నారు. ద్విచక్ర వాహనంతో పాటు గంజాయిని సీజ్ చేసి ముగ్గురిని అరెస్టు చేసి చోడవరం కోర్టులో హాజరు పరచామని ఎస్ఐ తెలిపారు.

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య


మృతురాలు దుర్గ

ఎస్.రాయవరం: తల్లి మందలించిందని ఓ యువతి ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకుని సోమవారం మృతి చెందింది. ఎస్ఐ పి.ప్రసాద్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామానికి చెందిన బత్తిన దుర్గ (17) ఇంటి వద్ద తల్లితో ఘర్షణ పడింది. ఈ క్రమంలో తల్లి మందలించిందని మనస్తాపం చెందిన దుర్గ ఇంట్లో ఫ్యానుకి ఉరి బిగించుకుని అపస్మారక స్థితిలోనికి చేరుకుంది. ఆరు బయట ఉన్న కుటుంబ సభ్యులు దుర్గను వెంటనే నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారని చెప్పారు. మృతి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉందని, వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

తుమ్మపాల: ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి, వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఏపీజేఏసీ అమరావతి నాయకులు డీఆర్వో పి.వెంకటరమణకు సోమవారం వినతిపత్రం అందించారు. మూడో దశ ఉద్యమంలో భాగంగా కార్యాచరణ ప్రారంభించినట్లు జిల్లా అధ్యక్షుడు సింగంపల్లి వాసు తెలిపారు. చిన్న తప్పిదాలకు సస్పెండ్ చేసి షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై ప్రశ్నించారు. సీటీ ప్రెసిడెంట్ ఆర్.నరసింహమూర్తి, చంద్రశేఖర్, పి.మురళి పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజమాణిక్యం


మాట్లాడుతున్న రెడ్డిపల్లి అప్పలరాజు

అనకాపల్లి టౌన్: రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా గుళ్ల రాజమాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెడ్డిపల్లి అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక నెహ్రూచౌక్ కొడగంటి గోవిందరావు భవనంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ పూర్తిస్థాయి కమిటీని త్వరలో నియమిస్తామన్నారు. త్వరలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు రాజాన దొరబాబు, వి.కాసుబాబు, మాకిరెడ్డి రామునాయుడు, కోరిబిల్లి శంకరరావు పాల్గొన్నారు.

ఏపీ పీఆర్ ఇంజినీర్స్ సమస్యలపై వినతి


డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘ సభ్యులు

దేవరాపల్లి: పంచాయతీరాజ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడుకు ఏపీ పీఆర్ ఇంజినీర్ల అసోసియేషన్ సంఘ సభ్యులు వినతి పత్రం అందజేశారు. దేవరాపల్లి మండలం తారువ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్, ఎస్డీఎఫ్ పనులపై విజిలెన్స్ నివేదికలు నిలిపివేయాలని జేఏసీ చైర్మన్ వి.వి.మురళీకృష్ణంనాయుడు కోరారు. దీనిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు, ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు, బి.రత్నప్రసాద్, అన్యం రాంబాబు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యాసంస్థలకు రెడ్‌క్రాస్ పురస్కారం


సుగుణారెడ్డికి పురస్కారం అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సేవలకు గుర్తింపుగా ఆదిత్య విద్యాసంస్థలను రెడ్‌క్రాస్ పురస్కారం వరించింది. విజయవాడ రాజ్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డికి అందజేశారు. టర్కీ, సిరియాలలో సంభవించిన భూ కంప సమయంలో ఆదిత్య విద్యాసంస్థలు సమకూర్చిన రూ.48 లక్షల విరాళం రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా అప్పట్లో అందజేశారు. అత్యధికంగా 2,200 మంది రక్తదానం చేశారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా 13మందికి పురస్కారాలు అందజేయగా కాకినాడ నుంచి ఆదిత్యకు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుగుణారెడ్డిను విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

దివ్యాంగుల నిధుల స్వాహాపై విచారణ

రోలుగుంట: స్థానిక వెలుగు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది 2005–06లో దివ్యాంగుల సమాఖ్య నిధులు రూ.42 లక్షలు పక్కదారి పట్టించారన్న ఫిర్యాదుపై మార్చి నుంచి ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టిన విషయం విదితమే. ఈ విచారణ అంశాలు నిర్ధారణ కోసం మరలా సోమవారం జిల్లా వెలుగు కార్యాలయం నుంచి అయిదు టీంలు కింద పది మంది అధికారులు వచ్చారు. క్షేత్రస్థాయి విచారణలో భాగంగా ఆయా గ్రామాలకు వెళ్లారు. దీన్ని స్థానిక అధికారులు గోప్యంగా ఉంచారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి


పురుషోత్తమరాజు మృతదేహం


మృతుడు పురుషోత్తమ రాజు(ఫైల్)

పరవాడ: అనకాపల్లి–గాజువాక జాతీయ రహదారిలో మారేడుపూడి సమీపంలో బావిలో పడి ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. పరవాడ ఎస్ఐ టి.తేజశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగపాక మండలం నాగులాపల్లి గ్రామానికి చెందిన పి.పురుషోత్తమరాజు(26) అనే యువకుడు స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టర్ వద్ద లేబర్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు వచ్చిన పురుషోత్తమరాజు రాత్రి ఇంటికి చేరకపోవడంతో ఆయన తమ్ముడు ఫోన్ చేశాడు. పురుషోత్తమరాజు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. సోమవారం ఉదయం మళ్లీ ఫోన్ చేయడంతో మారేడుపూడి సమీపంలో బావి వద్దకు కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం వచ్చిన స్థానికులు బావి వద్ద ఉన్న ఫోన్ లిఫ్ట్ చేసి బావిలో గుర్తుతెలియని మృతదేహం ఉందని తెలిపారు. దీంతో బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని పురుషోత్తమరాజు మృతి చెందినట్టు గుర్తించారు. పురుషోత్తమరాజుకు ఆన్‌లైన్ గేమ్ ఆడే అలవాటు ఉందని, అందులో నష్టపోవడం వల్లే ప్రాణాలు తీసుకొని ఉంటాడని భావిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తేజేశ్వరరావు చెప్పారు.

వేసవి శిక్షణలతో మానసిక వికాసం

- జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుబ్బారావు


సమ్మర్ క్యాంపు ముగింపులో విద్యార్థుల ప్రదర్శనలు


మాట్లాడుతున్న స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుబ్బారావు

పాయకరావుపేట: పట్టణంలోని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో 14 రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్యాంపు సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఉమ్మడి విశాఖ జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలపై ఆసక్తి కనబరచాలని సూచించారు. వేసవి శిక్షణల ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు తమ ఆలోచనా సరళిని, నైపుణ్యతను పెంపొందించుకోవచ్చన్నారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులతోపాటుగా తల్లిదండ్రులు తమ దినచర్యలో వ్యాయామం భాగంగా చేసుకోవాలని సూచించారు. ఆటపాటల ద్వారా తల్లిదండ్రులు వారికి మరింత చేరువ కాగలరని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పీఈటీలు శ్రీనివాస్, లక్ష్మణ్, అంజి, సురేష్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

రావికమతం: ఇంటి పెద్ద దిక్కు కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కొత్తకోటలోని పేద కుటుంబానికి వాసవీక్లబ్ సభ్యులు రూ.29,200 సోమవారం అందించారు. గ్రామంలో టీ దుకాణం నిర్వహిస్తున్న పడమటి నర్సింహమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దాంతో అతడి కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. క్లబ్ సభ్యులు పెంటపాటి అశోక్, గ్రంథికామేష్, కొనగళ్ల సంతోష్‌గురుమూర్తి పాల్గొన్నారు.

సీ.. వాహ్‌రియర్!

యుద్ధ విమానంలో విహరించే అనుభూతి వర్ణనాతీతం. ఆ అవకాశం దేశాధినేతలకే లభ్యం. అదే అనుభూతి పర్యాటకులకూ అందుబాటులోకి రానుంది. అయితే గగనతలంలో కాదు సుమా..! నిజంగా ఆకాశ మార్గంలోనే విహరిస్తున్నాం.. అనే సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేలా.. వేలాడదీసిన సీ హారియర్ యుద్ధవిమానం పర్యాటకుల్ని మరో లోకానికి తీసుకెళ్లనుంది. ఈ నెల 11న సీఎం చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

- తూర్పు తీరానికి మరో ఆభరణం.. సీ హారియర్ మ్యూజియం
- రూ.7.50 కోట్లతో యుద్ధ విమాన మ్యూజియం పనులు పూర్తి
- సీఎం జగన్ చేతుల మీదుగా 11న ప్రారంభం


డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన లాక్ష్యా మిసైల్ నమూనా


సీహారియర్ మ్యూజియం

దొండపర్తి(విశాఖ దక్షిణ) : సుందర సాగరతీరంతో పర్యాటకులను మంత్ర ముగ్ధుల్ని చేస్తున్న విశాఖ సిగలో మరో మణిహారం చేరనుంది. యుద్ధ సమయంలో గగనతలాన్ని గడగడలాడిస్తూ.. గాల్లో దూసుకుపోయిన సీ హారియర్ యుద్ధ విమానం మ్యూజియంగా సందర్శకుల్ని కనువిందు చేయనుంది. విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సరికొత్త ప్రణాళికలతో వీఎంఆర్‌డీఏ సిద్ధమవుతోంది. ప్రధానంగా బీచ్ రోడ్డులో మరిన్ని హంగుల్ని చేర్చుతోంది. అందులో భాగంగానే నౌకాదళంలో 32 ఏళ్ల పాటు సేవలందించి నిష్క్రమించిన సీ హారియర్ యుద్ధ విమానం.. మ్యూజియంగా మారి ప్రారంభానికి సిద్ధమైంది.

సీ హారియర్ విశిష్టత

1983లో బ్రిటిష్ ఏరోస్పేస్ నుంచి కొనుగోలు చేసిన ఈ సీ హారియర్ యుద్ధ విమానం నౌకాదళ ఏవియేషన్ విభాగంలో చేరింది. గోవాలోని ఐఎన్ఎస్ హంస యుద్ధ నౌకపై 32 ఏళ్ల పాటు దేశానికి సేవలందించింది. 2016లో సేవల నుంచి నిష్క్రమించింది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో వీఎంఆర్‌డీఏ ఈ యుద్ధ విమానాన్ని సాగరతీరంలో మ్యూజియంగా తీర్చిదిద్దుతోంది. విశాఖ సాగరతీరానికి అదనపు ఆభరణంలా ఇప్పుడు సీ హారియర్ యుద్ధ విమానం అందుబాటులోకి రానుంది.

రూ.7.5 కోట్లతో మ్యూజియం

బీచ్ రోడ్డు రాజీవ్ స్మృతి భవన్‌లో రూ.7.5 కోట్లతో సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియం పనులను వీఎంఆర్‌డీఏ చేపట్టింది. హైడ్రాలిక్ క్రేన్ సహాయంతో జీ ప్లస్ టూ బిల్డింగ్‌లో సీ హారియర్‌ని వేలాడదీశారు. దీని విశిష్టతతో పాటు పర్యాటకులకు నిజమైన యుద్ధ విమానంలో ప్రయాణించే అనుభూతి కలిగేలా ఈ మ్యూజియంను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో సిమ్యులేటర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అలాగే నావికాదళానికి, ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించి విశేషాలతో కూడిన చిత్రాలను కూడా ప్రదర్శించనున్నారు. ఇప్పటికే సాగరతీరంలో టీయూ–142 ఎయిర్‌క్రాఫ్ట్ సందర్శకులను ఎంతగానో అలరిస్తోంది. కురుసుర జలాంతర్గామి సందర్శకుల మనసు దోచుకుంటోంది. మరికొద్ది రోజుల్లోనే ఈ సీ హారియర్ మ్యూజియం కూడా అదనపు ఆకర్షణగా నిలవనుంది.

గోవా నుంచి ట్రైనింగ్ సిమ్యులేటర్

సీ హారియర్ మ్యూజియంలో వివిధ రకాల యుద్ధ విమానాల గురించి తెలుసుకునేలా సమగ్ర సమాచారంతో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. వీటికి తోడుగా.. ఇంటిగ్రేటెడ్ మ్యూజియంలో విభిన్న హంగులు.. కొత్త అనుభూతిని అందివ్వనున్నాయి. సీ హారియర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ని నడిపేందుకు ముందుగా శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణని నేరుగా ఎయిర్‌క్రాఫ్ట్‌లో కాకుండా దాని సిమ్యులేటర్ ద్వారా ఇవ్వనున్నారు. గోవాలోని ఐఎన్ఎస్ హంసా నేవల్‌బేస్‌లో ఉన్న ట్రైనింగ్ సిమ్యులేటర్‌ని విశాఖకు తీసుకొచ్చారు. కొచ్చి నేవల్ స్టేషన్‌లో ఉన్న విడిభాగాల్ని కూడా రప్పించారు. ఇవి ఈ మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

సీఎంతో ప్రారంభోత్సవం



సీ హారియర్ మ్యూజియం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మ్యూజియం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మ్యూజియంని సందర్శించడంతో పాటు, ఆ జ్ఞాపకాలు సందర్శకులకు గుర్తుండిపోయేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జ్ కమిషనర్

క్లుప్తంగా

ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పుల వీధి దుర్గాదేవి అమ్మవారి దేవాలయం 8వ వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి గాజుల అలంకరణ, పసుపు-కుంకుమలతో విశేష పూజలు జరిపారు. ఆలయానికి వచ్చే మహిళా భక్తులకు కమిటీ సభ్యులు పసుపు, కుంకుమ, జాకెట్‌ముక్క, స్వీట్‌లు పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ సభ్యుడు ఎస్.బాబు ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి, నిత్యధూప, దీప, నైవేద్యాలకు సహకరించాల్సిందిగా భక్తులను కోరారు. కార్యక్రమంలో కింతాడ శ్రీరామమూర్తి, అప్పారావు, రాజు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు



తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొణతాల నీలిమ

అనకాపల్లిటౌన్ : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ అన్నారు. గవరపాలెం కర్రిపెద్దయ్యగారివీధిలో కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంక్, కుళాయిలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేటర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జీవీఎంసీ నిధులతో నీటి సరఫరా ఇక్కట్లకు చెక్ పెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కె.భాస్కర్, పార్టీ నేతలు కర్రి శివన్నారాయణ, భీశెట్టి కృష్ణఅప్పారావు, గణేష్, బొడ్డేడ శంకరరావు, లక్ష్మణరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అనకాపల్లిటౌన్ : జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు అనకాపల్లి డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ కె.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లవీధి, లక్ష్మీనారాయణనగర్, నాయిబ్రాహ్మణ వీధి, జంపావారివీధి, పిళ్లావారివీధి, పెరుగుబజార్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 795 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	------	-----
మొదటి రకం	4,300	4,910
రెండో రకం	3,870	4,250
మూడో రకం	3,100	3,840

అనకాపల్లి సినిమాలు

అరంగేట్రం	రాజా
రామబాణం	సత్యనారాయణ స్క్రీన్-1
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (తెలుగు 3డి)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
ఉగ్రం	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-6 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 458 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 392 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఇ-స్మార్ట్ స్కూళ్లు

- నాడు-నేడు నిధులతో మూడు స్కూళ్లలో ఏర్పాటు
- రూ.6.76 కోట్లతో శరవేగంగా నిర్మాణ పనులు
- ఈ విద్యా సంవత్సరానికే అందించేలా చర్యలు



నిర్మాణదశలో వేల్పులవీధి స్మార్ట్‌స్కూల్



భీమునిగుమ్మం హైస్కూల్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న స్మార్ట్ స్కూల్

అనకాపల్లిటౌన్ : బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో ఉత్తమ విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక ‘మన బడి నాడు-నేడు’ పథకంలో సర్కారీ స్కూళ్ల రూపరేఖల్ని సమూలంగా మార్చేశారు. దుంపల బడులుగా చెప్పుకునే ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్‌కు మించిన స్థాయిలో తీర్చిదిద్దారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో కూడా స్కూళ్ల అభివృద్ధికి ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు వెచ్చిస్తోంది.

మూడు స్కూళ్లకు రూ.6.76 కోట్లు

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ స్కూళ్ల ప్రమాణాలు ఊహించని స్థాయిలో మెరుగయ్యాయి. దీంతో విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో మరిన్ని స్కూళ్లను నాడు నేడులో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ నిధులు వెచ్చిస్తోంది. ఇందులో భాగంగా జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో మూడు స్కూళ్లను అభివృద్ధి చేసేందుకు ఏకంగా రూ.6 కోట్ల 76 లక్షల నిధుల్ని కేటాయించింది. ఈ నిధులతో జోన్ పరిధిలో విజయరామరాజుపేటలోని ఏఎంసీ కాలనీ స్కూల్‌కు రూ.82.44 లక్షలు, వేల్పులవీధి టౌన్ ఎలిమెంటరీ(బాలాజీదాస్) స్కూల్‌కు రూ.3.11 కోట్లు, భీమునిగుమ్మం హైస్కూల్ ఆవరణలో ప్రాథమిక పాఠశాలకు రూ.2.86 కోట్లు వెచ్చిస్తున్నారు. అధునాతన వసతులతో కూడిన భవన నిర్మాణానికి గతేడాది డిసెంబర్లో శంకుస్థాపనలు జరగ్గా, ఈ ఏడాది జూలై నాటికి పనులు పూర్తిచేసి, విద్యార్థులకు అందించేందుకు ప్రయత్నిస్తున్నారు.

స్మార్ట్ స్కూళ్లుగా అభివృద్ధి

ప్రస్తుతం అంతా డిజిటల్ యుగమే. ప్రభుత్వం కూడా పాఠశాలల్ని ఆ దిశగా అభివృద్ధి చేసేందుకు సిద్ధమైంది. పట్టణ పరిధిలో అభివృద్ధి చూస్తున్న పాఠశాలల్ని కూడా స్మార్ట్ స్కూళ్లుగా తీర్చిదిద్దుతున్నారు. విశాలమైన తరగతి గదులు, అధునాతన బెంచీలు, డిజిటల్ బోధనకు అనువైన సాంకేతికత, మధ్యాహ్న భోజనానికి ప్రత్యేక గదులు, డైనింగ్ హాల్, విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నారు. నూతనంగా నిర్మించే భవనాల్లో సుమారు 600 మంది విద్యార్థులు చదువుకునేలా వసతులు కల్పిస్తున్నారు. భవన నిర్మాణాలను జీవీఎంసీ కమిషనర్ నేతృత్వంలో ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

జూలైలో నిర్మాణాలు పూర్తి



రెండంతస్తుల్లో ఆధునిక సాంకేతికతతో భవనాలను నిర్మిస్తున్నాం. జీవీఎంసీ జోన్ పరిధిలో స్మార్ట్ సిటీలో భాగంగా ఈ మూడు పాఠశాలల్ని ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. వీటి నిర్మాణ పర్యవేక్షణ జీవీఎంసీ కమిషనరే స్వయంగా చూస్తున్నారు. భవనాలు నిర్మాణం పూర్తయిన వెంటనే విద్యాశాఖ అధికారులకు అప్పగిస్తాం. సాధ్యమైనంత వరకు, ఈ విద్యా సంవత్సరానికి దీన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న కృతనిశ్చయంతో పనిచేస్తున్నాం.

–పి.వెంకటరమణ, జోనల్ కమిషనర్, అనకాపల్లి

బుద్ధుని మార్గం శిరోధార్యం



బుద్ధపూర్ణిమ వేడుకల్లో పాల్గొన్న అయిపాల్ మహాథేరో భాంతేజీ

అనకాపల్లిటౌన్ : అశోకుడు, మహాత్మాగాంధీ వంటి ఎందరో మహనీయులను బుద్ధ భగవానుడు చూపిన శాంతి, అహింస, సత్యం, ధర్మం ఆకర్షించాయని మయన్మార్(బర్మా) బౌద్ధ భిక్షువు అయిపాల్ మహాథేరో భాంతేజీ అన్నారు. మండలంలోని శంకరం పంచాయతీ పరిధి, బొజ్జన్నకొండ వద్ద సోమవారం బుద్ధ పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధ పూర్ణిమ ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించడం శుభపరిణామమన్నారు. ప్రపంచ శాంతికి బుద్ధుని పంచశీల మహోన్నత మార్గమని, ప్రతి ఒక్కరూ ఆయన చెప్పిన శాంతి, అహింస, ధర్మ మార్గాలను అనుసరించాలని కోరారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఇతర బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి సంఘాల సభ్యులు బల్లా నాగభూషణం, నేలపూడి బాలరాజు, పల్లా బాబాజీ, బోర వేణుగోపాల్ గౌతమ్, మల్లారపు లోవచంద్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ టాపర్‌కు అభినందన



ఆళ్ల చరిష్మాకు మిఠాయి తినిపిస్తున్న హెచ్‌ఎం సూర్యనారాయణ

అనకాపల్లి టౌన్ : గవరపాలెం జీవీఎంసీ చిన్నహైస్కూల్లో పదోతరగతి ఫలితాల్లో స్కూల్ టాపర్‌గా నిలిచిన ఆళ్ల చరిష్మా(557/600)ను పాఠశాల హెచ్‌ఎం ఆదిరెడ్డి సూర్యనారాయణ అభినందించారు. సోమవారం స్కూల్ ఆవరణలో మిఠాయి తినిపించి, ఉన్నత చదువుల్లో మరింతగా రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్కూల్లో 12 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ఈ ఏడాది విద్యార్థుల ఉత్తీర్ణ తశాతం బాగా పెరిగిందన్నారు. స్కూల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని, క్రమం తప్పకుండా పునఃశ్చరణ చేస్తే మంచి ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. భవిష్యత్తులో మరింతగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గాప్రసాదరావు, కె.జనార్దనరావు, ఎ.అచ్చియ్యనాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫెయిలైనవారికి ప్రత్యేక శిక్షణ

అనకాపల్లిటౌన్ : ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు మంగళవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్టు ఎంఈవో డి.దివాకర్ తెలిపారు. జూన్ 1వ తేదీ వరకు ఈ తరగతులు కొనసాగనున్నట్టు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని 6 జీవీఎంసీ స్కూళ్లు, మండలంలోని 11 జెడ్పీ హైస్కూళ్లలోనూ ఆయా సబ్జెక్టుల్లో సంబంధిత ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు బోధించనున్నట్టు వెల్లడించారు. ఫెయిలైన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు 17వ తేదీ తుది గడువని తెలిపారు.

పుస్తక పఠనం.. మంచి లక్షణం



పోస్టర్ ఆవిష్కరణలో వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

కశింకోట : గ్రంథాలయాల్లో పుస్తక పఠనాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి కోరారు. కశింకోట శాఖా గ్రంథాలయంలో నెల రోజులకు పైగా నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో అనేక ఇతిహాస గ్రంథాలు, పురాణాలు, నవలలు, పోటీ పరీక్షల పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలన్నారు. గ్రంథాలయ పుస్తకాలను చదివి, చాలా మంది ఉన్నత స్థాయికి వెళ్లారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వరలక్ష్మి, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, రిటైర్డు టీచర్ యల్లపు రామచంద్రరావు, కోదండ సీతారామాలయం కమిటీ మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

‘కనీస వేతనం అమలు చేయాలి’



జీవీఎంసీ డంపింగ్ యార్డు వద్ద ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

అనకాపల్లిటౌన్ : జోన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ క్లాప్ డ్రైవర్లకు(కాంట్రాక్టు) కనీస వేతనం రూ.18,500లు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక జోన్ కార్యాలయం డంపింగ్ యార్డు వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లు అందరినీ ఆప్కాస్‌లో కలపాలని, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని, హెల్త్ కార్డు అలవెన్స్ రూ.6 వేలు ఇవ్వాలని, జీవో నెం.7 అమలు తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకని ఎడల ఈ నెల 15న సమ్మెకు దిగనున్నట్టు హెచ్చరించారు. ధర్నాలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ జోన్ అధ్యక్షుడు ఎ.జె.శివకుమార్, కార్యదర్శి పి.సతీష్ కుమార్, కోశాధికారి కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా రోగులకు మెడికల్ కిట్‌ల పంపిణీ



తిమ్మరాజుపేటలో బోదకాలు వ్యాధిగ్రస్తులకు కిట్‌లు అందిస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫైలేరియా వ్యాధి పట్ల జాగ్రత్తలు వహించాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేటలో సోమవారం ఫైలేరియా వ్యాధి గ్రస్తులకు ఆమె మెడికల్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోదకాలు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్,ఏఎన్ఎం ప్రేమకుమారి,మెడికల్ అసిస్టెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

శంకరం రోడ్డు సమస్యపై వినతి

తుమ్మపాల : అనకాపల్లి మండలం శంకరం జంక్షన్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుచేసి, గ్రామ ప్రధాన రహదారి కనెక్టివిటీకి మరమ్మతులు చేయాలని కోరుతూ శంకరం గ్రామ పంచాయతీ తీర్మానంతో సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, జాతీయ రహదారి కాంట్రాక్ట్ సంస్థ డీబీఎల్ మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి గ్రామానికి చేరే వీధి రోడ్లను ధ్వంసం చేసి మరమ్మతులు చేయకపోవడంతో, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. లోతట్టు గ్రామం సత్తెమ్మపేట వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంలో వినియోగించిన క్రషర్ బుగ్గి ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలోని గృహాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. తక్షణమే బుగ్గి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలి

- మేడే ఉత్సవాల ముగింపు సభలో నరసింగరావు

మునగపాక : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం శరణ్యమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. గవర్ల అనకాపల్లిలో మేడే ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆదివారం రాత్రి ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలని చూస్తే సహించేదిలేదన్నారు. ఎంతోమంది త్యాగధనుల పోరాట ఫలితంగా వచ్చిన స్వాతంత్ర్యం అన్ని వర్గాల ప్రజలకు అందేలా ఉండాలన్నారు. వారం రోజుల పాటు మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. పలు ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, ఐద్వా మహిళా సంఘ అధ్యక్షురాలు మాణిక్యం, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల రాము, సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్ , సీపీఎం నాయకులు బ్రహ్మాజీ, జోగినాయుడు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అభినందన



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో టెన్త్ టాపర్లతో హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది



కశింకోట బాలికల హైస్కూల్లో ప్రతిభ చూపిన బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం స్వర్ణకుమారి

కశింకోట : మండలంలోని పలు పాఠశాలల్లో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు.

- కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన కొవ్వాడ మోక్షిత, డోకుల బిందుతోపాటు, 500కు పైగా మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులను హెచ్‌ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, నాగేశ్వరరావు, రామారావు, అప్పారావు, శేషుకుమారి, భవాని తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక బాలికల హైస్కూల్లో అత్యధిక మార్కులు సాధించిన ఉగ్గిన మోనిక, ఉత్తమ మార్కులు సాధించిన బాలికలను హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి అభినందించారు. పీడీ పెంటకోట కమల, విద్యా కమిటీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- నరసింగబిల్లి హైస్కూల్లో అత్యధిక మార్కులు సాధించిన సీహెచ్ చంద్రశేఖర్, ఎం.పవన్‌కుమార్, లీలా ఆదిలక్ష్మిలను సర్పంచ్ కోన అరుణ, హెచ్‌ఎం సుమమణి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మళ్ల కోటేశ్వరరావు, షేక్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో పిల్లలకు కథలు చెప్తున్న ఉపాధ్యాయుడు బి.సురేష్

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో సోమవారం ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు కథలు వినిపించారు. నీతి కథలను చెప్తూ, అందులో నీతిని పిల్లలు గ్రహించేలా విశదీకరించారు. పుస్తక పఠనం జరిపించారు. గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.సురేష్, బి.వి.నరసింహమూర్తి, అచ్చెర్ల సచివాలయ కార్యదర్శి ఎం.మహేష్, కె.దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో నువ్వుల రైతుకు తీవ్ర నష్టం



కైలాసపట్నంలో నీట మునిగిన నువ్వు పంట కుప్పలు

కోటవురట్ల : పంట అందొచ్చే సమయంలో అకాల వర్షం నువ్వుల రైతును నష్టాలపాలు చేసింది. మండలంలోని పలువురు రైతులు రబీలో వరికి బదులు నువ్వుల పంటను సాగు చేశారు. పంట కోత వరకు వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడి వచ్చింది. కోతలు పూర్తయ్యాయి. కుప్పలు వేశారు. ఇంతలో అకాల వర్షం రైతుల ఆశలను నీరు కార్చేసింది. నువ్వుల పంట కుప్పలు నీట మునగడంతో తీవ్ర నష్టం వాటిలిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో కైలాసపట్నం, రాజుపేట, గొట్టివాడ, చౌడువాడ, సుంకపూరు, తంగేడు, పాములవాక, తిమ్మాపురం, లింగాపురం, బి.కె.పల్లి, చినబొడ్డేపల్లి, పి.కె.పల్లి, కె.వెంకటాపురం, కొడవటిపూడి తదితర గ్రామాలలో సుమారు 60 ఎకరాలలో నువ్వుల పంటను సాగు చేశారు. నాలుగు రోజులుగా కురిసిన కుండపోత వర్షానికి పంట పూర్తిగా నాశనమైంది. కైలాసపట్నం, రాజుపేట, లింగాపురం ప్రాంతాలలో నువ్వులు పంట కుప్పలు నీట మునిగాయి. మరికొన్ని చోట్ల పనలుగా ఉండగానే నీట మునిగి నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి తెలిపారు. వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని నమోదు చేయాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘ యువజన కార్యదర్శిగా రాముయాదవ్

అనకాపల్లిటౌన్ : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా మండలంలోని మెట్టపాలెం గ్రామానికి చెందిన ముమ్వల రాముయాదవ్ సోమవారం నియమితులయ్యారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణయ్య అప్పగించిన పదవికి న్యాయం చేసి, సంఘ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని రాము పేర్కొన్నారు.

రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.2 లక్షల విరాళం



దళితవాడలో రామాలయం నిర్మాణానికి సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

మునగపాక : మునగపాక దళితవాడలోని రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నబాబురాజు సోమవారం రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా గతంలో ఆలయ అభివృద్ధికి రమణమూర్తిరాజు రూ.5 లక్షల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవల రెండు దఫాలుగా రూ.3 లక్షలు అందించారు. మిగిలిన రూ.2 లక్షలను ఆలయ కమిటీకి సోమవారం అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, కాలనీ వాసులు పిల్లి అప్పారావు, దిమ్మల నూకరాజు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్కరణలతోనే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను మెమెంటోతో అభినందిస్తున్న మణిరాజు, హెచ్‌ఎం శ్రీనివాసరావు

నక్కపల్లి : విద్యావ్యవస్థలో జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణల వల్లే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచారని డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అయినంపూడి మణిరాజు అన్నారు.

వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పదో తరగతిలో ఈ ఏడాది అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుతూ ప్రతిభ కనపరిస్తే ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతారన్నారు. 10 మంది విద్యార్థులు 550 నుంచి 561 మార్కులు వరకు సాధించారని, పాఠశాల చరిత్రకే గర్వకారణమన్నారు. వారందరికీ మెమెంటోలు, మిఠాయిలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఏడిద సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమీకృత దాణాకు ప్రత్యామ్నాయంగా అజోల్లా

మునగపాక : అజోల్లా పెంపకం ద్వారా అధిక పాలదిగుబడులు పెరుగుతాయని ఎమ్మెల్యే యు. వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) అన్నారు. మునగపాక పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత దాణాకు ప్రత్యామ్నాయంగా అజోల్లా నిలుస్తుందన్నారు. పశుపోషణ ఖర్చు తగ్గుతుందన్నారు. అజోల్లాను దాణాతో కలిపి వాడడం వల్ల పాల దిగుబడి పెరుగుతుందని, ప్రతి లీటర్ పైన రూ.10 వరకు లాభం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు పిల్లి అప్పారావు, ఆడారి కాశీబాబు, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుడి కుటుంబానికి సాయం



నిత్యావసర సరకుల్ని అందిస్తున్న స్వామి వివేకానంద సంఘ ప్రతినిధులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడక శివారు పల్లెపేటకు ఎందిన వికలాంగుడు కంబాల అప్పలరాజు కుటుంబానికి శ్రీ స్వామి వివేకానంద వికలాంగుల అసోషియేషన్ అధ్యక్షుడు మేరుగు నూకరాజు ఆధ్వర్యంలో సోమవారం రూ.ఐదు వేల నగదు, నిత్యవసర వస్తువులు, కూరగాయలు అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన అప్పలరాజు ఇంటికే పరిమితం కావడంతో వికలాంగుల సంఘం ద్వారా సహాయం అందజేశారు. మేరుగు సన్యాసిరావు, ఆనందరావు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.